క్లుప్తంగా

నేటి గ్రామసభ రద్దు

కొయ్యూరు: మండలంలోని ఆడాకులలో గురువారం నిర్వహించనున్న గ్రామసభను వాయిదా వేస్తున్నట్టు తహసీల్దార్ పి.ఎస్.ఎల్.ప్రసాద్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామసభ షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటించామని, అయితే రెవెన్యూ సదస్సుల కారణంగా రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు. త్వరలో గ్రామసభ తేదీని ప్రకటిస్తామన్నారు.

ఎస్ఐల బదిలీలు

ఎటపాక: ఎటపాక ఎస్ఐగా పనిచేస్తున్న కె.పార్థసారథి గుర్తేడుకు బదిలీ అయ్యారు. ఎటపాక ఎస్ఐగా అప్పలరాజును నియమిస్తూ జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేసారు. అప్పలరాజు ఎస్బీ ఎస్ఐగా పనిచేస్తున్నారు.

గంగవరం : స్థానిక ఎస్ఐ డి.భూషణం రంపచోడవరం అడిషినల్ ఎస్ఐగా బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. గంగవరం ఎస్ఐగా పాడేరు డీసీఆర్‌బీ ఎస్ఐ వెంకటేష్‌ను నియమించారు. ఆయన రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలిసింది.

మండల సమావేశం రేపు

పాడేరురూరల్(అరకులోయరూరల్): పాడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో డేవిడ్ రాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సొనారి రత్నకుమారి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరుకావాలని, మండల స్థాయి అధికారులు తమ శాఖలకు చెందిన పూర్తి సమాచారంతో విధిగా రావాలని సూచించారు.

చిన్న తరహా వ్యాపారాలపై సర్వే



సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని వ్యాపారు దుకాణాల సర్వేను గ్రామ సచివాలయ సిబ్బంది బుధవారం నిర్వహించారు. పంచాయతీ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఆర్థిక సాయమందించి, మరింతగా ప్రోత్సహించేందుకు గాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేపడుతున్నట్టు చెప్పారు. సుమారు 40 దుకాణాల వద్ద వివరాలు సేకరించి యజమాని ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లు జెరాక్స్ కాపీలను తీసుకున్నట్టు తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్, మహిళ పోలీసు, డీఏ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో-2గా రత్నకుమార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రత్నకుమార్

ముంచంగిపుట్టు: మండల విద్యాశాఖాధికారి-2గా సీహెచ్.రత్నకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జోలాపుట్టు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎంగా పనిచేస్తున్న రత్నకుమార్‌ను ప్రభుత్వం ఎంఈవో-2గా నియమించింది. ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తానని, మండల ప్రజలు, ఉపాధ్యాయులు పూర్తి సహకారం అందించాలని కోరారు. రత్నకుమార్‌కు ఎంఈవో కృష్ణమూర్తి, సీఆర్‌పీలు అనిల్, సురేష్, ఈశ్వర్, గౌరిశంకర్, హరిలు పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలియజేశారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

పాడేరురూరల్(అరకులోయరూరల్)/గూడెంకొత్తవీధి/కొయ్యూరు/దుంబ్రిగుడ/రంపచోడవరం/రాజవొమ్మంగి: జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. భూ సమస్యలపై వినతులు స్వీకరించారు. పాడేరు మండలంలో తహసీల్దార్ త్రినాథరావు, జీసీసీ డైరెక్టర్ నాగరాజు, జీకేవీధి మండలంలో తహసీల్దార్ రామకృష్ణ, సర్పంచ్ రామకృష్ణ, ఆర్ఐ మహాదేవ్, సర్వేయర్ శ్రీను, కొయ్యూరు మండలంలో ఎంపీపీ రమేష్, డీటీ కుమారస్వామి, సర్పంచ్ వెంకటలక్ష్మి, వీఆర్వో సత్యనారాయణ, జీసీసీ మాజీ చైర్మన్ ప్రసాద్, దుంబ్రిగుడ మండలంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్, సర్పంచ్ లక్ష్మణ్, వీఆర్వో లక్ష్మి, సర్వేయర్ హరీష్‌కుమార్, రంపచోడవరం మండలంలో తహసీల్దార్ రామకృష్ణ, ప్రత్యేకాధికారి షరీఫ్, ఆర్ఐ నిర్మల, రాజవొమ్మంగి మండలంలో ఆర్ఐ చెల్లమ్మ, సర్పంచ్ సూరిబాబు, వీఆర్వో వెంకటరెడ్డి, సర్వేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెతలు తీరేనా?

- కాజ్‌వే ఎత్తు పెంచాలని గిరిజనుల వినతి
- చినుకు పడితే చిత్తడే
- కొద్దిపాటి వర్షాలకే నిలిచిపోతున్న రాకపోకలు
- గ్రామస్తులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు



కోడ్రాజుపేట వాగుపై ఉన్న లోలెవెల్ కాజ్‌వే



టేకులబోరు- కొండ్రాజుపేట రహదారి దుస్థితి

కూనవరం: టేకులబోరు నుంచి కొండ్రాజుపేట వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. గత రెండు దశాబ్దాల నుంచి ఈ రహదారిని పట్టించుకునే నాథుడే లేరని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిది పంచాయతీల్లోని గిరిజనులకు దశాబ్దాల నుంచి ఇదే ప్రధాన రహదారి. 12 గ్రామాలకు చెందిన గిరిజనులు వివిధ పనుల మీద మండల కేంద్రానికి రావాలంటే ఈ రహదారి ఎంతో దగ్గరి మార్గం. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో గతంలో టేకులబోరు నుంచి చింతూరు మండలం చట్టి వరకు మెటల్ రోడ్డు ఉండేది. 1997లో మాజీ ఎంపీ సోడెరామయ్య చొరవతో టేకులబోరు నుంచి జిన్నెలగూడెం వరకు 6 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించారు. దశాబ్దాల తరబడి ఈ రహదారి నేటి వరకు మరమ్మతుకు నోచుకోలేదని స్థానికులు చెబుతున్నారు. దశాబ్దాలుగా వస్తున్న వరదులు, భారీ వాహనాల రాకపోకలతో ఈ రహదారి దారుణంగా మారిందంటున్నారు. పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చినుకు పడితే రహదారి చిత్తడిగా మారుతుందని, గోతుల్లో వర్షపునీరు చేరడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం రద్దీ

వ్యవసాయ కూలీలు, రైతులు, వర్తక, వ్యాపారస్తులతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి గత మూడు దశాబ్దాల నుంచి ఎలాంటి అభివృద్ధికి నోచుకోక పోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. వ్యవసాయ సీజన్‌లో ట్రాక్టర్లు, ఆటోలు, భారీ వాహనాల ద్వారా రైతులు, కూలీలను, ఎరువుల బస్తాలు ,ఆయిల్ ఇంజన్లు వంటి వ్యవస్థాయ పరికరాలను ఈ రోడ్డు మార్గం మీదుగా పొలాల్లోకి తీసుకు వెళ్తుంటారు. ఉదయం 5.00 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు వాహనాల రాకపోకలతో, కూలీల సందడితో రద్దీగా ఉంటుంది.

కాజ్‌వే ఎత్తు పెంచితే మేలు

కొండ్రాజుపేట కాజ్‌వే ఎత్తు పెంచితే ఎగువ ఉన్న గిరిజన గ్రామాలకు ఎంతో మేలు జరుగుతుందని స్థానికులు కోరుతున్నారు. వరద ముప్పు నుంచి ఉపశమనం పొందాలంటే కాజ్‌వే కనీసం 10 అడుగుల మేర ఎత్తు పెంచాలని సూచిస్తున్నారు. వర్షాకాలంలో కొద్దిపాటి వరదొస్తే చాలు కొండ్రాజుపేట కాజ్‌వే ముంపునకు గురవుతుందని చెబుతున్నారు. తద్వారా ఇక్కడ సమీపంలోని 10 నుంచి 12 గ్రామాల గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదలు తగ్గిన అనంతరం కూడా నెలరోజుల వరకు ఆ రహదారిపై ప్రయాణం నరక ప్రాయంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే కాజ్‌వే ఎత్తు పెంచాల్సిన అవసరం ఉందని తద్వారా వరద సమయాల్లో కొండ్రాజుపేట, టేకులబోరు మధ్య రాకపోకలు సజావుగా సాగే అవకాశం ఉంటుందని గిరిజనులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



కొండ్రాజుపేట రోడ్డు మరమ్మతుల విషయంలో అధికారుల ఉదాసీనత తగదు. గిరిజన గ్రామాలకు రహదారి కావడంతో చులకన భావం చూపిస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. రహదారికి మరమ్మతులు చేపట్టకుంటే గిరిజనులను సమీకరించి ఆందోళన చేపడతాం.

– గుజ్జా మోహన్‌రావు, సీపీఐ డివిజన్ కార్యదర్శి

కొత్త కాజ్‌వే నిర్మించాలి



కొండ్రాజుపేట కాజ్‌వే ఎత్తు పెంచాలన్నది గిరిజనుల చిరకాల కోరిక. ప్రస్తుతం ఉన్న కాజ్‌వే లోలెవెల్ కావడంతో కొద్దిపాటి వరద వచ్చినా నీట మునుగుతుంది. రాకపోకలకు తరచు అంతరాయం కలుగుతుంది. ఉన్నతాధికారులు కాజ్‌వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– పాయం రంగమ్మ, ఎంపీపీ, కూనవరం

పార్లమెంట్‌లో గిరిజన సమస్యల ప్రస్తావన హర్షణీయం



మాట్లాడుతున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ

దుంబ్రిగుడ: అరకు పార్లమెంటు పరిధిలో గిరిజనులు ఎదుర్కొంటున్న కష్టాలు, గిరిజన హక్కులు, చటాలపై సమగ్రంగా పార్లమెంట్‌లో వివరించిన అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణికి ప్రత్యేక ధన్యవాదాలతో పాటు అభినందిస్తున్నట్టు దుంబ్రిగుడ మండల జెడ్పీటీసీ సభ్యురాలు చటారి జానకమ్మ, ఎంపీపీ బాకా ఈశ్వరిలు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ మన్యంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించారన్నారు.

1/70 చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలని, జీవో నెంబర్-3కు ప్రత్యామ్నాయంగా మరో జీవోను కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, విద్య, వైద్యం గిరిజనులకు పూర్తిస్థాయిలో అందే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలన్నారు. పార్లమెంట్‌లో తన గళంతో అధికార పక్షం ఎంపీలతో సైతం ప్రతి ఒక్కరూ అరకు పార్లమెంట్‌లో గిరిజన ప్రాంతాల అభివృద్ధి వైపు ఆలోచించేలా మట్లాడినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీహెచ్.మల్లేశ్వరావు, నాయకులు సింహాచలం, కృష్ణారావు, గణపతి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గోపాల్ తదితరులున్నారు.

శిశువుల ఆరోగ్యంపై అవగాహన



తల్లులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ఉదయ్ కుమార్‌రెడ్డి

చింతూరు: చలికాలంలో శిశువుల ఆరోగ్యాన్ని కాపాడే చర్యల్లో భాగంగా మండలంలోని ముకునూరులో బుధవారం తల్లులకు చైల్డ్ చెకప్, శీతాకాలపు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ శీతాకాలంలో శిశువులకు వెచ్చని దుప్పట్లను వినియోగించాలని సూచించారు. చలిగాలికి గురికాకుండా గదుల్లో వేడి ఉష్ణోగ్రత ఉండేలా చూడాలని, క్రమం తప్పకుండా తల్లిపాలు అందించాలని, పొగకు దూరంగా ఉంచాలని సూచించారు. శిశువులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే సమీపంలోని వైద్యులకు చూపించాలని ఆయన తెలిపారు. తులసిపాక పీహెచ్‌సీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు



ప్రశంసాపత్రాలతో విజేతలు, చిత్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలత తదితరులు

పాడేరురూరల్(అరకులోయరూరల్): పాడేరు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలను బుధవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త, ఆధ్యాత్మిక సేవా సంఘం చైర్మన్ కొట్టగుళ్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆధ్మాత్మిక దృక్పదం కలిగి ఉండాలన్నారు. క్రమశిక్షణతో బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. విశ్వ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఇన్‌చార్జి సత్యనారాయణ, నరసింహారావు, భవదీయం ఆలయ సేవా ట్రస్ట్ చైర్మన్ నాగేంద్ర, ప్రిన్సిపాల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

115 మందికి వైద్య పరీక్షలు



తూటంగిలోని శిబిరంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ శివారు గ్రామాలైన దాతురు, జర్రాయిలతో దుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాంబాబు మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. వేడినీరు తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య శిబిరాల్లో సుమారు 115 వ్యాధిగ్రస్తులతో పాటు అంగన్‌వాడీ చిన్నారులు, పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశామన్నారు. హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పీ రోషిణి, ఏఎన్ఎం కాంత, పూర్ణిమ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



చింతపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్, ఎంపీడీవో శ్రీనివాసరావు



జి.మాడుగులలోని శిక్షణలో పాల్గొన్న సర్పంచ్‌లు, అధికారులు



రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న ఈటీసీ అబ్జర్వర్ నిహారిక

చింతపల్లి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండురోజుల పాటు జరిగిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, బాల్యవివాహాల నిరోధక చట్టం సంబంధించి జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలతో అనారోగ్యం దరిచేరుతుందన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాల పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, సీడీపీవో రమణి, స ర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ,వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులు నిర్వహించిన సుస్థిర అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో తేజ్‌రతన్, మండల ఇంజినీర్ అధికారి ఎస్.మాణిక్యం, ఎంఈవో బాబూరావు పడాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, సీడీపీవో పీవో సువర్ణమ్మ, ఈవోపీఆర్డీ డేవిడ్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రవికిషోర్ ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన సుస్థిర అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమంలో ఇద్దరు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు.

రాజవొమ్మంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో యాదగిరీశ్వరరావు ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన సుస్థిర అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమంలో ఈటీసీ సామర్లకోట నుంచి వచ్చిన అబ్జర్వర్ నిహారిక మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీతారాం, ఏపీఎం రామాంజనేయులు, ఏపీఓ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

సీలేరులో భారీ వర్షం

సీలేరు: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో సీలేరులో భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పొలాల్లో వర్షపు నీరు చేరింది. మరలా తుపాను ముప్పుతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న పూర్వ విద్యార్థులు

ముంచంగిపుట్టు: మండలంలోని దారెల పంచాయతీ కేంద్రంలో ఇటీవల మృతి చెందిన చెండా సుబ్రహ్మణ్యం కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందించారు. సుబ్రహ్మణ్యంతో పెదబయలు ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాలలో 2000-2005 సంవత్సరాలలో కలిసి చదువుకున్న సహచర విద్యార్థులు బుధవారం దారెల గ్రామానికి వచ్చి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధితుడి కుటుంబ సభ్యులకు రూ.6516లను అందించి, నిత్యం అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. పూర్వ విద్యార్థులు నాగరాజు, ఆనంద్, శంకర్, పులిరాజు, గోపీనాథం, సుమన్, లక్ష్మణ్, వైకుంఠరావు, తిరుపతి పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

హుకుంపేట: గ్రామాల్లో గంజాయి సాగు, రవాణా, సారా తయారీకి దూరంగా ఉండాలని ఎస్ఐ సురేష్‌కుమార్ చెప్పారు. తీగలవలస పంచాయతీ గరుడాపల్లిలో ఆయన బుధవారం పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ గంజాయి, సారాకు దూరంగా ఉండాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, బాగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పీసా గ్రామసభలు

రంపచోడవరం: మండలంలోని 19 పంచాయతీల పరిధిలో 91 గ్రామాల్లో 49 పీసా గ్రామ సభలు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసుదొర తెలిపారు. సభలకు సర్పంచ్ అధ్యక్షుడిగా ఉంటారని, ఉపాధ్యక్షులు, కార్యదర్శి పదవులకు ఎన్నికలు గ్రామసభ ద్వారా జరుగుతాయన్నారు.డీటీ పర్యవేక్షిస్తారన్నారు.

గ్రామ సమస్యలపై వినతి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ రంగమ్మ

కూనవరం: మండలంలో నెలకొన్న పలు సమస్యలను స్థానిక ఎంపీపీ పాయం రంగమ్మ, చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్‌లు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ దృష్టికి బుధవారం తెసుకెళ్లారు.

మండలంలో టేకులబోరు నుంచి పెదార్కూరు పంచాయతీ వాడగుంపు వరకు, చినార్కూరు పంచాయతీ పరిధిలో తెల్లవారిగూడెం గుంపు నుంచి శబరి కొత్తగూడెం వరకు రహదారులను పూర్తి చేయాలని, జిన్నెలగూడెం చెరువు మరమ్మతులు చేపట్టాలని కోరారు. గ్రామాల్లో పాడైన రోడ్లు బాగు చేయాలని, దీంతో పాటు కోతులగుట్టలో సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి కేజీబీవీ వరకు అంధకారం నెలకొని ఉందని, విద్యుత్ స్తంభాలు వేసి లైట్లు ఏర్పాటు వేయాలని వినతిలో కోరారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు అవార్డు ఎంక్వయిరీ గ్రామ సభలు నిర్వహించి, చేసి స్ట్రక్చర్ వ్యాల్యూ ఇప్పించాలని కోరారు. దీనిపై పీఓ సానుకూలంగా స్పందించినట్టు ఎంపీపీ రంగమ్మ తెలిపారు. పీవోను కలిసిన వారిలో నాయకుడు కట్టం రామయ్య తదితరులున్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్షలు



అడ్డతీగల రేంజ్ అధికారి సయ్యద్ సహెన్నాకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ జిల్లా చైతన్య వేదిక సంక్షేమ సంఘం నేతలు

వై.రామవరం: వై.రామవరం గ్రామం నుంచి మఠం భీమవరం, పోతవరం గ్రామాల మీదుగా మండల ఎగువ ప్రాంతమైన గుర్తేడు, పాతకోట గ్రామాలకు, అన్ని పంచాయతీలను కలిపే అతిము ఖ్యమైన ప్రధాన రహదారిని నిర్మించాలని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తు, సోమవారం ప్రారంభించిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 3వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఈ సమస్య పరిష్కారానికి కచ్చితమైన హామీ వరకు దీక్షలు కొనసాగుతాయన్నారు. మండలంలోని మారుమూల గ్రామాలకు రోడ్లు, కొండవాగులపై వంతెనలు నిర్మించి, డోలీమోత కష్టాల తొలగించాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వర్లు, త్రిమూర్తులు, నరసన్నదొర, ప్రసాద్, లక్ష్మణరావు, చిన్నారావు, గంగరాజు, శారద పాల్గొన్నారు.

దీక్షా శిబిరాన్ని సందర్శించిన రేంజ్ అధికారి

వై.రామవరంలో రోడ్ల నిర్మాణం కోసం దీక్షలు చేపట్టిన ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం దీక్షా శిబిరాన్ని అడ్డతీగల అటవీశాఖ రేంజ్ అధికారి సయ్యద్ సహెన్నా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గుర్తేడు రోడ్డు నిర్మాణం ఫైల్ తమ వద్ద నుంచి అనుమతి కోసం ప్రభుత్వానికి పంపించామన్నారు. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. సంఘ నేతలు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం కోసం ఖచ్చితమైన హామీ వచ్చేంత వరకు దీక్షను కొనసాగిస్తామంటు రేంజ్ అధికారికి వినతిపత్రం అందజేశారు.

గ్రామ సచివాలయ ఉద్యోగుల నిరసన



గంగవరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు

గంగవరం: విశాఖపట్నానికి చెందిన కార్పొరేటర్ కాకి గోవిందారెడ్డి గ్రామ సచివాలయ ఉద్యోగులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మండల గ్రామ సచివాలయ ఉద్యోగులు బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయ మండల నాయకులు బాలుదొర, దొరబాబు, శివ గణేష్‌ల ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులకు కాకి గోవిందా రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆ అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మండలంలో గల గ్రామసచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రహదారిపై ఆక్రమణలు తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నర్సమ్మ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని తహసీల్దార్ నర్సమ్మ అన్నారు. మండల కేంద్రంలో రహదారి విస్తరణలో భాగంగా వ్యాపారులు, గృహ యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ, పంచాయతీ స్థలాలను ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలు, గృహాల ముందు షెడ్లను, ఫ్లెక్సీ బోర్డులను స్వచ్ఛందంగా తొలగించాలన్నారు. ఈ మేరకు తొలుత నోటీసులు అందిస్తామని, 15 రోజుల్లో ఆక్రమించి, నిర్మించిన దుకాణ, ఇళ్లు తొలగించాలన్నారు. రహదారి విస్తరణకు అందరూ సహకారించాలని ఆమె కోరారు. వీఆర్వో రమేష్, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నేతలు, వ్యాపారులు, దుకాణ, ఇళ్ల యజమానులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లకు న్యాయం చేయాలి



జి.మాడుగులలో గ్రామ వలంటీర్లతో నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు



ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న వలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు దేవ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో గ్రామ వలంటీర్లు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల వలంటీర్ల సంఘం అధ్యక్షుడు జి.దేవా మాట్లాడుతూ ఎన్నికల ముందు గ్రామ వలంటీర్లకు హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలుచేయకుండా మోసం చేస్తోందన్నారు. గ్రామ వలంటీర్ల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వలంటీర్లకు వేతన బకాయిలు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. నేత చిన్నయ్య పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండల కేంద్రంలోని బుధవారం గ్రామ వలంటీర్ల చేపట్టిన నిరసన కార్యక్రమానికి గిరిజన సంఘం నేతలు, సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మన్నపడాల్, సీఐటీయూ మండల కమిటీ అధ్యక్షుడు టి.శోభన్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందించడంలో, కరోనా సమయంలో గ్రామ వలంటీర్లు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీను కూటమి ప్రభుత్వం అమలుచేసి గ్రామ వలంటీర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 26 నుంచి 28 వరకు మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్టు చెప్పారు. దీనబంధు, చిన్నారావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.